క్లుప్తంగా

ఘనంగా రాహుకేతు పూజలు



మొగిలి శివాలయంలో రాహుకేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

8న ఆలయ భూములు కౌలు వేలం

బంగారుపాళెం: మండలంలోని మొగిలీశ్వర స్వామి ఆలయ భూములు కౌలు వేలం ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజులు సోమవారం తెలిపారు. మొగిలి, 170 గొల్లపల్లె, టేకుమంద, ఊటువంక గ్రామాల్లో గల ఆలయ భూములను 2024–25 నుంచి 2026–27 సంవత్సరం వరకు మూడేళ్లకు కౌలుకు ఇస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఆలయ ఆవరణలో కౌలు వేలం ప్రారంభం అవుతుందన్నారు. రూ.3 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



వైద్య పరీక్షలు చేస్తున్న ప్రవీణ్‌కుమార్

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 65 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ నివారణకు బీసీజీ వ్యాక్సిన్ ప్రక్రియ కొనసాగుతుందని, 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి నగదు విరాళం



నగదు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు సోమవారం ఓ దాత కుటుంబం నగదు విరాళంగా అందజేసింది. కర్నూలుకు చెందిన రుద్రనాథ్ కుటుంబం రూ.1,00,116 నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి స్వామి దర్శన భాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సిబ్బంది వాసు, విఘ్నేష్ తదితరులు ఉన్నారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట సచివాలయం ఎదుట సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, ఎమ్మెల్యే మురళీమోహన్ కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే మురళిమోహన్ పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బందిని అభినందించారు.

చిత్తూరు అర్బన్: చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కమిషనర్ అరుణ ప్రారంభించారు.

తవణంపల్లె: మండలంలోని జి.గొల్లపల్లె, పత్రపల్లె, సరకల్లులో పింఛన్లు పంపిణీ చేశారు.

కాణిపాకం: చిత్తూరు మండలం బీఎన్‌ఆర్‌పేటలో ఎమ్మెల్యే గురజాల పింఛన్ల పంపిణీని ఆయన ప్రారంభించారు.

దోమకాటుతో అనర్థాలెన్నో

- నివారణపై శ్రద్ధ వహించాలి
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు



పూల కుండీలో ఉన్న నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: వర్షాకాలం కావడంతో దోమల సీజన్ మొదలైంది. చిన్నదోమే కదా.. కుడితే ఏమవుతుందిలే అని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం. దోమల నివారణ, నియంత్రణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. లేదంటే అనారోగ్యంతో పాటు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. దోమల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమల వ్యాప్తితో ప్రమాదం

ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీటి గుంతలు, కంప చెట్లు, పిచ్చిమొక్కలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమలు నివాసం ఏర్పర్చుకుంటాయి. గుడ్లు, లార్వా వృద్ధి చెంది దోమగా మారి యుద్ధానికి సిద్ధమవుతుంది. ఈ ప్రమాదాన్ని నివారించాలంటే నీటిని సక్రమంగా వినియోగించాలి. దోమల నివారణకు మందులు పిచికారీ చేయాలి.

నిర్లక్ష్యం చేస్తే

క్యూలెక్స్ దోమ కాటుతో హఠాత్తుగా జ్వరం వస్తుంది. విస్తారమైన నీటి నిల్వలో పెరిగే క్యూలెక్స్ దోమతో ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈవ్యాధిని చికిత్స ద్వారా నియంత్రించడం కష్టం. ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవడమే మేలు. ఇంటి ఆవరణలో పూల కుండీలు, పాత టైర్లు, నీటి ట్యాంకుల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏడిస్ దోమతో..

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. తగ్గినట్లుగానే తగ్గి వారం లేదా పది రోజుల్లో మళ్లీ తిరగబెడుతుంది. ఏడిస దోమ కాటు కారణంగా ఈవ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కాళ్లలో నొప్పి, శరీరంపై చిన్న చిన్న దద్దుర్లు ఏర్పడుతాయి. డెంగీ, చికున్ గున్యా వ్యాధి లక్షణాలు దాదాపుగా ఒకేలా ఉంటాయి. నెలల తరబడి నొప్పులు బాధిస్తాయి. దీని నివారణ కోసం దోమల పెరుగుదలను అరికట్టాలి. ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించాలి. వ్యాధి పట్ల సరైన అవగాహన పెంచుకొని తగిన చికిత్స చేయించుకోవాలి.

దోమ కాటుకు గురైతే..

అనాఫిలిస్ దోమ కాటుతో మలేరియా, చలి వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. వ్యాధి ప్రారంభంలో సరైన చికిత్స చేయించకపోతే నెలల తరబడి బాధిస్తుంది. గర్భిణులకు, చిన్నారులకు ఈ వ్యాధి తీవ్రత అధికంగా ఉంటుంది. చలితో జ్వరం వచ్చిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధిని నిర్ధారించుకోవాలి. సకాలంలో మందులు వాడుతూ జాగ్రత్తలు తీసుకోవాలి.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> వాతావరణంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లో ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ డ్రమ్ముల్లో, గచ్చుల్లో, తొట్లలో నీటి నిల్వలేకుండి చర్యలు తీసుకుంటున్నాం. దోమల నివారణకు మందులు పిచికారీ చేయిస్తున్నాం.– ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి

తవణంపల్లె: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మల్లకుంటలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, సుగర్‌వాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. వర్షాకాలంలో వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్యం చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మల్లకుంటలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



ప్రజల సమస్యలు వింటున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, మెప్మా విభాగాలకు సంబంధించి పలు వినతులను బాధితులు అందజేశారు. వీటిని విచారించి, సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనీల్‌కుమార్ నాయక్, రెవెన్యూ అధికారి గోపాలకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ల వారీగా సమస్యల పరిష్కారం



అధికారులతో సమీక్షిస్తున్న ఈఈ హరి

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌స్టేషన్ల వారీగా సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. రూరల్ ఈఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి సబ్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇది ప్రతివారం కొనసాగుతుందన్నారు. అందులో సమస్యలను నమోదు చేసి వాటిని పరిష్కరించి నివేదికను ఉన్నతాధికారులకు పంపాలని చెప్పారు. సబ్‌స్టేషన్ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 4న విద్యుత్ అదాలత్ కార్యక్రమం పైపల్లె సబ్‌స్టేషన్‌లో ఉంటుందని చెప్పారు. వందశాతం విద్యుత్ బిల్లుల వసూళ్లు చేయాలని ఆదేశించారు. పల్లెల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు అయితే సకాలంలో మార్పు చేయాలన్నారు. ఫీడర్ల వారీగా లైన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసులను సకాలంలో విడుదల చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఏఈలు, సబ్‌ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

సారూ..ఆఫీసుకు ఎప్పుడొస్తారు మీరు?



గుడుపల్లె తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ, టేబుల్‌పైన సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

- కుప్పంలోనే గుడుపల్లె తహసీల్దార్ పాలన!
- చుట్టపు చూపుగా కార్యాలయానికి వచ్చి వెళుతున్న వైనం
- కార్యాలయం చుట్టూ జనం ప్రదక్షిణలు

గుడుపల్లె: ఎన్నికల విధులకు నియమితులైన తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్ గుడుపల్లె కార్యాలయాలని చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ప్రతి సోమవారం అధికారులు తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలి. అయితే ఇక్కడ తహసీల్దార్ కార్యాలయం దీనికి భిన్నంగా ఉంటోంది. తహసీల్దార్ కుర్చీ ఎప్పుడు చూసినా ఖాళీగా దర్శనమిస్తూ ఉండడంతో ఆయన ఎప్పుడొస్తారో తెలియక వివిధ పనుల నిమిత్తం ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని మండల ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో సమావేశాల పేరిట ఎక్కువ కాలం కుప్పంలోనే తహసీల్దార్ మకాం వేశారు. అక్కడే ఒక గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. రెండు మూడు రోజులకోసారి మాత్రం కార్యాలయానికి వచ్చి సర్టిఫికెట్‌లకు మాత్రం కీ పెట్టి వెళ్లిపోతున్నారు. ఎన్నికలు పూర్తయి నెల గడుస్తున్నా ఆయన కుప్పం వీడి గుడుపల్లెకు రావడం లేదు. రైతులు తమకు ఏవైనా రెవెన్యూ సంబంధిత పనులు ఉంటే సంబంధిత అధికారి ద్వారా కుప్పంకు వెళ్లి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. పాలనా వ్యవహారాలన్నీ కుప్పంలో ఉంటున్న గది నుంచే ఆయన నిర్వర్తిస్తున్నారని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా రెవెన్యూ పనులు?

గుట్టుచప్పుడు కాకుండా రెవెన్యూ సంబంధించిన మ్యుటేషన్లు, డీకేటీ భూములు మార్పులు–చేర్పులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వారికే తెలియకుండా ఈ పనులన్నీ కుప్పంలో చేస్తున్నారని ప్రచారంలోకి వచ్చింది. చేయి తడిపితే డీకేటీ భూముల విషయంలో మార్పులు–చేర్పులు చేస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తమ అనుభవంలోనే ఉన్నాయి కాబట్టి డీకేటీ భూములు ఎప్పటికైనా తమకే చెందుతాయనే ధైర్యంతో కొందరు ఉంటున్నారు. మరికొందరేమో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకపోవడంతో మిన్నకుండిపోయారు. ఏప్రిల్ నుంచి నూతనంగా కొనుగోలు చేసి భూములు పట్టాదారు పాస్తకాలు కోసం మ్యుటేషన్‌కు ఇంకా రైతులు పెట్టుకోలేదు. తహసీల్దార్ ఎప్పుడు వస్తారో, వెళ్తారో తెలియని పరిస్థితి వల్ల వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి తహసీల్దార్ అందుబాటులో ఉండేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ టేబుల్‌పై సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలను కూటమి నేతలు తహసీల్దార్ కార్యాలయంలో పెట్టేందుకు సోమవారం తీసుకువచ్చారు. అయితే గంటల తరబడి ఎదురుచూసినా తహసీల్దార్ రాకపోవడం..సిబ్బందిని ప్రశ్నిస్తే ఆయన ఎప్పుడు వస్తారో తమకు సమాచారం లేదని చెప్పడంతో చేసేదేమీ లేక ఆ ఫొటోలను తహసీల్దార్ టేబుల్‌పై పెట్టి వెనుతిరిగారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని మాజీ ఎంపీ దుర్గారామకృష్ణ తెలిపారు. ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం పీవీకేఎన్ మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం ఆదేశాల మేరకు ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తల్లిపేరు మీద ఒక మొక్కను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీవీకేఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ మీరాసాహేబ్, బీజేపీ నాయకులు హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటే ప్రక్రియలో దుర్గా రామకృష్ణ

విరమణ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు





తవణంపల్లె: లోకయ్యను సత్కరిస్తున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్, సిబ్బంది, బంగారుపాళెం: సుబ్రమణ్యం దంపతులను సన్మానిస్తున్న పోస్టల్ సిబ్బంది

తవణంపల్లె: పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా 35 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి, విరమణ పొందిన కానిస్టేబుల్ లోకయ్యకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది లోకయ్య దంపతులకు శాలువ కప్పి, పూలదండలు వేసి ఘనంగా సత్కరించి రింగును బహూకరించారు. అనంతరం ఎస్‌ఐ అనిల్‌కుమార్ మాట్లాడుతూ హోదా పక్కన పెడితే, తండ్రిలాంటి కానిస్టేబుల్ లోకయ్యకు నా చేతులమీదుగా సత్కారం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో పోలీస్ సిబ్బంది పని చేసి డిపార్టుమెంట్‌లో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు మునీంద్ర, రాజేంద్ర, రైటర్ అమీర్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రమణ్యం సేవలు ప్రశంసనీయం

బంగారుపాళెం: తపాలాశాఖలో సుబ్రమణ్యం అందించిన సేవలు ప్రశంసనీయమని ఎస్‌పి లక్ష్మయ్య అన్నారు. మండలంలోని నలగాంపల్లె బీపీఓగా విధులు నిర్వర్తిస్తున్న సుబ్రమణ్యం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం బంగారుపాళెం తపాలాశాఖ కార్యాలయం ఆవరణలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు తపాలాశాఖ ద్వారా సుబ్రమణ్యం అందించిన సేవలను కొనియాడారు. 40 ఏళ్లుగా గ్రామీణ ప్రజలకు సేవలు అందించి మన్ననలు పొందారన్నారు. అనంతరం సుబ్రమణ్యం దంపతులను పోస్టల్ సిబ్బందితోపాటు పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది విద్యావతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

చిత్తూరు కలెక్టరేట్: ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకే మన పెద్దలు ఆరోగ్యమే మహా భాగ్యం అని అన్నారని, హలో కిడ్స్ చిల్డ్రన్స్ పాఠశాల డైరెక్టర్ లోహిత్ అన్నారు. నగరంలోని గురునగర్‌కాలనీలో ఉన్న ఆ పాఠశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నర్సరీ పిల్లలతో ఆస్పత్రి రోల్ ప్లే యాక్టివిటీ చేయించినట్లు చెప్పారు. విద్యార్థులను ఆస్పత్రులకు తీసుకెళ్లి వివిధ విభాగాలను చూపించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. పౌష్టికాహారం, సంపూర్ణ ఆరోగ్యానికి చే పట్టాల్సిన జాగ్రత్తలను తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల డాక్టర్ పల్లవిరెడ్డి, నిర్వాహకురాలు పవిత్ర పాల్గొన్నారు.

అరుణగిరిపై ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

మామిడిలో సేంద్రియ సాగుపై అవగాహన

ఐరాల: మామిడిలో రసాయన ఎరువులు, పురుగు మందులను వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో మామిడితోటలను సాగు చేయడం వల్ల చెట్లకు పురుగులు, తెగుళ్లను తట్టుకునే రోగ నిరోధకశక్తి పెరుగుతుందని డాక్టర్ గంగాధర్, ప్రకృతి వ్యవసాయ రైతు ఆనందనాయుడు పేర్కొన్నారు. మండలంలోని పుత్రమద్దిలో సోమవారం మామిడి సాగు చేసే రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రకృతి మామిడి సాగు వల్ల రైతులకు సాగు ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు, ఆదాయం చేకూరుతుందని తెలిపారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గంగాధర్

రూ.44 లక్షల విలువైన సెల్‌ఫోన్ల అప్పగింత



పోగొట్టుకున్న ఫోన్లు ఎస్పీ ద్వారా అందుకున్న బాధితులు

చిత్తూరు అర్బన్: జిల్లాలో చోరీకి గురైన రూ.44 లక్షల విలువైన మొబైల్ ఫోన్లను ఎస్పీ మణికంఠ బాధితులకు అప్పగించారు. చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. తప్పిపోయిన, చోరీ అయిన ఎలాగైనా తెప్పించి బాధితులకు అందజేయాలనే ఉద్దేశంతో «చాట్‌బాట్» పేరిట ఓ యాప్‌ను రూపొందించామన్నారు. దీని ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ దేశంలో ఎక్కడ ఉన్నా తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ.44 లక్షల విలువైన 210 మొబైల్‌ఫోన్లను తీసుకొచ్చి బాధితులకు అంజేశామన్నారు. ఇప్పటి వరకు ఆరు దశల్లో 1,700 ఫోన్లను బాధితులకు అందించినట్టు వెల్లడించారు. బాధితులు ఫోన్–94409 00004 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అంటూ ఓ మెసేజ్ పెడితే చాలని చెప్పారు. మొబైల్‌ఫోన్లను తెప్పించడంతో ప్రతిభ చూపించిన చిత్తూరు సీసీఎస్ సీఐ ఎస్.రామాంజనేయులు, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు.

డయేరియా వ్యాప్తిని అరికడదాం





ఐరాలలో డయేరియాపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, అగరంపల్లెలో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి రాజేశ్వరి

ఐరాల: ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, డయేరియా వ్యాప్తిని అరికడదామని ఐరాల, కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, రాజేశ్వరి సూచించారు. ఐరాల, కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని ఐరాల, అగరంపల్లె జెడ్పీ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు డయేరియా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డయేరియా తాగునీరు, ఆహార పదార్థాలు కలుషితం కావడం వల్ల సోకుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని పేర్కొన్నారు. భోజనానికి ముందు, తరువాత సబ్బుతో చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం, వండిన ఆహార పదార్థాలపై మూతలు పెట్టడం చేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థ పదార్థాలను మూత ఉన్న డస్ట్‌బిన్‌లో భద్రపరిచి దూరంగా పారవేయాలని వెల్లడించారు. చిన్న పిల్లలు బయటి చిరుతిండ్లు తినకుండా చూసుకోవాలన్నారు. డయేరియా బారిన పడిన వారు దగ్గరలోని ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలను, ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీరు, మురుగు నీటి వల్ల దోమలు, అంటువ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. దీనికి అవసరమైన జింక్ మాత్రలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర మందులు పీహెచ్‌సీలతో పాటు సబ్‌సెంటర్లలోనూ ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్ల వద్ద ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి డయేరియాపై పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, పీహెచ్‌ఎన్ జీవకళ, ఎంపీహెచ్ ఈఓ శివయ్య పాల్గొన్నారు.